# సాక్షి సిద్దిపేట

ఆదివారం । 13 । జూలై । 2025




## హరిత హీరోలు

పర్యావరణాన్ని పరిరక్షించడంలో చెట్ల పాత్ర విస్మరించలేనిది. అందుకే వృక్షో రక్షితి రక్షితః అంటారు పెద్దలు. చెట్లను మనం కాపాడితే అవి మనల్ని కాపాడతాయనేది ఈ సూక్తి అర్థం. దీనిని మనసా వాచా కర్మణా ఆచరిస్తూ తమకున్న ఆసక్తి కొద్దీ ఇంటా బయటా మొక్కలను నాటి వనాలు సృష్టిస్తున్నారు. మనిషికి ప్రాణవాయువును అందించే చెట్లను విరివిగా పెంచుతూ అటు పర్యావరణాకి, ఇటు మానవాళికి ఇతోధికంగా తమవంతు సాయపడుతున్న హరిత హీరోలపై ఈ వారం సండే స్పెషల్.

8లో



## న్యూస్‌రీల్

### అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి**

అక్కన్నపేట(హుస్నాబాద్): ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. అక్కన్నపేట మండలం గొల్లకుంట గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు కాశబోయిన రాజవ్వ ఇంటి నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. గ్రామాల్లో పదేళ్ల తర్వాత పేదల కళ్లల్లో వెలుగులు చూస్తున్నామన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడ్డ ప్రజా ప్రభుత్వం..ఇందిరమ్మ రాజ్యం దిశగా అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, వైస్‌చైర్మన్ ఎగ్గిడి ఐలయ్య, కట్కూర్ గ్రామ సింగిల్ విండో వైస్‌చైర్మన్ ముకుందంరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, నాయకులు ముత్యాల సంజీవ్‌రెడ్డి, చింతల బాల్‌రెడ్డి, మోతిలాల్‌నాయక్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి

**ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



మంత్రులకు వినతిపత్రాన్ని అందిస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్రంలో షెడ్యూల్ కులాల జనాభా గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఎస్సీలకు 18% రిజర్వేషన్లు కేటాయించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆయన శనివారం మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ...ఎస్సీలకు 18% రిజర్వేషన్లు కేటాయించాలని కోరుతూ ఇద్దరు మంత్రులకు వినతి పత్రాన్ని సమర్పించానన్నారు.

### సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో షీటీమ్ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సోషల్ మీడియాకు ఎంతదూరం ఉంటే భవిష్యత్ బాగుటుందని సిద్దిపేట షీటీమ్ ఏఎస్‌ఐ కిషన్ విద్యార్థులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో శనివారం విద్యార్థులకు మహిళా రక్షణకు ఉన్న చట్టాలు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, షీటీమ్, మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ..వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు అందరూ కలిసిమెలసి ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్‌లను ఎత్తవద్దన్నారు. బాలికలు, మహిళల భద్రతకు షీటీమ్, పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చదువుపైనే దృష్టి పెట్టాలని చెప్పారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

**ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్**




మాట్లాడుతున్న రజనీకాంత్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్ డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో రజనీకాంత్ పాల్గొని మాట్లాడారు. వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఫీజుల బకాయిలు చెల్లించలేదని ఆరోపించారు. తక్షణమే ఫీజులు విడుదల చేయకుంటే ఛలో హైదరాబాద్ పేరుతో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బత్తుల అభిషేక్ ఖాను తదితరులు పాల్గొన్నారు.



మహాయమ్మ ఆలయానికి బోనాలతో వస్తున్న మహిళలు

## అమ్మకు బోనమెత్తి..

జిల్లా కేంద్రంలో శనివారం బోనాల మహోత్సవాలు వైభవంగా కొనసాగాయి. మహాయమ్మ, బోచమ్మ, కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్‌రూం కాలనీలోని బంగారు మైసమ్మతోపాటుగా ఇతర అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే అమ్మవార్లకు వివిధ కుల, కాలనీ సంఘాల ఆధ్వర్యంలో బోనాలను సమర్పించారు. శివశక్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ల హోరులతో అమ్మవారి నామస్మరణతో సిద్దిపేట పట్టణం మార్మోగింది. కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్ రూం కాలనీలోని బంగారు మైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలోనే ఆదర్శంగా కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూం కాలనీ నిలుస్తుందన్నారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)



జోగినీ, పోతురాజుల విన్యాసాలు

# పైసలిస్తే పనులు ఖాయం!

**తహసీల్దార్ కార్యాలయాల్లో దళారుల దందా**

- నివాసం లేకున్నా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ
- కొండపాక తహసీల్దార్ కార్యాలయం లీలలు



సాక్షి, సిద్దిపేట/కొండపాక(గజ్వేల్): కాసులకు ఆశపడి కొందరు రెవెన్యూ అధికారులు ఇష్టారాజ్యంగా సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. రెవెన్యూ శాఖలో కొంతకాలంగా అవినీతి, అక్రమాలు పెరిగిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి వివిధ సర్టిఫికెట్ల జారీకి ఆన్‌లైన్ పద్ధతిలోకి వచ్చినా కొందరు రెవెన్యూ ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. భూముల మ్యుటేషన్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్, రేషన్ కార్డుల మంజూరు వంటి వాటిని పొందేందుకు దళారులకు డబ్బులిచ్చి సులువుగా పని చేయించుకుంటున్నారు. దళారులకు డబ్బులిచ్చి తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి కొండపాక తహసీల్దార్ కార్యాలయం నుంచి ఓ మహిళ ఏకంగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను పొందిన ఘటనే ఇందుకు నిదర్శనం.

### ఇదీ జరిగింది...

తొగుట మండలం గుడికందుల గ్రామంలో యాదయ్యకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య 14ఏళ్ల క్రితం మృతిచెందింది. మొదటి భార్యకు ఇద్దరు పిల్లలున్నారు. రెండవ భార్య సరిత హైదరాబాద్‌లో ఉంటుంది. గతేడాది భర్త అనారోగ్యంతో మృతిచెందాడు. భర్త పేరు మీద గుడికందులలో ఒక ఎకరం 20 గుంటల భూమి ఉంది. ఆ భూమిని తన పేరు మీద రాయించుకునేందుకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను రెండవ భార్య సరిత కొండపాక తహసీల్దార్ కార్యాలయం నుంచి పొందింది. ఈ సర్టిఫికెట్‌ను తీసుకుని తొగుట మండలంలో 878/అ/1లో ఉన్న 1.20ఎకరాల భూమిని మ్యుటేషన్ చేయాలని ఆన్‌లైన్ స్లాట్ బుక్ చేసుకున్నారు. ఈ విషయం తెలిసిన మొదటి భార్య పిల్లలు తొగుట తహసీల్దార్‌ను కలిసి ఆ భూమి తమది అని చెప్పి వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేయాలని తహసీల్దార్‌కు సమాచారమిచ్చారు. దీంతో విచారణ చేపట్టిన తహసీల్దారు అధికారులను తప్పు దోవ పట్టించి ఎఫ్‌ఎంసీని పొందినట్లు గుర్తించారు. దీనిపై కొండపాక మండల తహసీల్దార్ శ్యాంను వివరణ అడగగా ఎఫ్‌ఎంసీని రద్దు చేశామన్నారు.

### దళారుల దందా...

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో యథేచ్ఛగా దళారుల దందా కొనసాగుతోంది. సర్టిఫికెట్‌కు ఒక రేటు ఫిక్స్ చేసి దళారులు దరఖాస్తుదారుల నుంచి వసూలు చేస్తున్నారు. అన్ని తామే చూసుకుంటామని కొంత సమయం పెట్టి ఎలాంటి సర్టిఫికెట్ అయిన జారీ చేయిస్తున్నారు. దళారులు వసూలు చేసిన డబ్బుల నుంచి కొంత ఆయా అధికారులకు ముట్టచెప్పి పనులు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వివిధ సర్టిఫికెట్ల కోసం నేరుగా వెళ్లిన వారికి వివిధ సాకులు చెప్పి తిరిగిపంపించేస్తున్నారని వాపోతున్నారు. దీంతో దళారులను దరఖాస్తుదారులు ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ ప్రత్యేక దృష్టిపెట్టి దళారులు వసూళ్ల దందాను అరికట్టాలని, తప్పుడు పత్రాలు జారీ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### దళారీ వ్యవస్థను అరికట్టాలి

మీ సేవలో దరఖాస్తు చేసిన తర్వాత మాన్యువల్ తీసుకునే దరఖాస్తులకు సరైన రికార్డులు నిర్వహించడం లేదు. ఇటీవల మా స్నేహితుడి పిల్లల జనన ధ్రువీకరణ పత్రం కోసం మాన్యువల్‌గా దరఖాస్తు చేస్తే ఆ దరఖాస్తుల వారి దగ్గర లభించలేదు. దానిని దొరకబట్టేందుకు మూడు నెలలు తిప్పించుకున్నారు. కార్యాలయానికి వెళ్తే వారు నిర్లక్ష్యంగా సమాధానమిచ్చి పదే పదే తిప్పించుకుంటున్నారు.

-షాదుల్లా, సిద్దిపేట వాసి

### మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం

తహసీల్దార్ కార్యాలయం నుంచి సర్టిఫికెట్లు పొందేందుకు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేయాలి. క్షేత్రస్థాయిలో పరిశీలించి దరఖాస్తులను అప్రూవ్ చేస్తాం. దళారుల ద్వారానే వస్తే సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. అలా జరిగితే తప్పకుండా సంబంధిత అధికారుల మీద చర్యలు తీసుకుంటాం.

-అబ్దుల్ హమీద్, అదనపు కలెక్టర్

## బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

**ఎంపీ రఘునందన్‌రావు సమక్షంలో పలువురు బీజేపీలో చేరిక**



బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రఘునందన్‌రావు

గజ్వేల్: బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఎంపీ రఘునందన్‌రావు సూచించారు. పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు శనివారం ఎంపీ రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లోని ఎంపీ రఘునందన్‌రావు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ...స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని సూచించారు. బీజేపీలో చేరిన వారిలో సిద్ది నవీన్, శ్రీవర్ధన్, యాదగిరి, గోపి తదితరులున్నారు.

### ఏడీఏ శ్రీనివాస్‌కు పదోన్నతి



హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ డివిజన్ ఏడీఏ శ్రీనివాస్‌కు డీఏఓగా పదోన్నతి పొంది పెద్దపల్లి జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా నియమితులయ్యారు. చేర్యాల ఏడీఏ రాధికకు హుస్నాబాద్ ఏడీఏగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు శ్రీనివాస్ తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారిగా స్వరూపారాణి రావడంతో ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న రాధిక చేర్యాల ఏడీఏగా కొనసాగనున్నారు.

# ముమ్మరంగా వనమహోత్సవం

**జిల్లాలో 22.47 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం**

- ఇప్పటివరకు 7లక్షలకు పైగా మొక్కలు నాటడం పూర్తి
- అన్ని శాఖల సమన్వయంతో ముందుకు



వనమహోత్సవంలో మొక్కలు నాటుతున్న అటవీ అధికారులు, సిబ్బంది (ఫైల్)

సిద్దిపేటకమాన్: సిద్దిపేట జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 22.47లక్షల మొక్కలు నాటాలని నిర్దేశించారు. ఇప్పటికే లక్ష్యానికి అనుగుణంగా జిల్లా అటవీశాఖ, పంచాయితీరాజ్ శాఖ అధికారులు ఏడు మున్సిపాలిటీలు, డీఆర్‌డీఓ పరిధిలో 489, ఫారెస్టు 3తోపాటు మొత్తం 499 నర్సరీల్లో 25.05లక్షల మొక్కలను సిద్ధం చేశారు. వనమహోత్సవం ద్వారా మొక్కలు నాటేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అన్ని వర్గాలు, అన్ని శాఖలను భాగస్వామ్యం చేస్తూ మొక్కలను నాటేలా లక్ష్యం నిర్దేశించింది. ఆకుపచ్చ జిల్లాగా మార్చేందుకు అధికార యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా మొక్కలను నాటుతున్నారు.

**25 లక్షల మొక్కలు సిద్ధం**

జిల్లాలో 499 నర్సరీల్లో 25,05,348 మొక్కలను పంపిణీ చేయడానికి అధికారులు సిద్ధంగా ఉంచారు. 2025–26 సంవత్సరానికి గాను జిల్లాలో 22.47లక్షల (22,47,800) మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 7.17లక్షల (31.68%) మొక్కలు నాటారు. వనమహోత్సవ పట్టణాలు, గ్రామ పంచాయితీ పరిధిలో కొనసాగుతుంది. జిల్లా యంత్రాంగం అన్ని గ్రామ పంచాయితీల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా, నాటిన ప్రతి మొక్కను కాపాడాలని అన్ని శాఖల సిబ్బందికి జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసేలా అధికారులు పనులు కొనసాగిస్తున్నారు. గతేడాది (2024–25) జిల్లాలో 21.62లక్షల మొక్కలు నాటేలా లక్ష్యం పెట్టుకోగా 19.12లక్షల మొక్కలు నాటి 88.41% పూర్తి చేశారు.

### వనమహోత్సవం కొనసాగుతుంది

జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతుంది. ఈ ఏడాది అన్ని శాఖల అధికారుల సమన్వయంతో జిల్లాలో 22.47లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్దేశించారు. లక్ష్యాన్ని పూర్తి చేసేలా ప్రభుత్వ ఆదేశానుసారం అన్ని ప్రాంతాల్లో ఇతర అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతుంది.

- జోజి, జిల్లా ఇన్‌చార్జి అటవీ అధికారి సిద్దిపేట

### 16 శాఖలు.. 22 లక్షల మొక్కలు

జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమం వివిధ శాఖల సమన్వయంతో కొనసాగుతుంది. అటవీ శాఖ 75,600, పంచాయితీరాజ్, రోడ్లు భవనాల శాఖకు 13.2లక్షలు, మున్సిపాలిటీలకు 4.66లక్షలు, ఎడ్యుకేషన్ 2వేలు, మైన్స్ అండ్ జియాలజీ 2300, హార్టీకల్చర్, సెరీకల్చర్ 1,29,300, పశుసంవర్ధక శాఖ 1వేయి, పౌరసరఫరాల విభాగం 2200, ఎక్సైజ్ 67,700, వైద్యారోగ్యశాఖ 1400, బీసీ సంక్షేమశాఖ 500, నీటిపారుదల శాఖ 45,500, వ్యవసాయశాఖ 1,27,700, ఇండస్ట్రియల్ 20వేలు, పోలీసుశాఖ 4600 మొక్కలు నాటేలా లక్ష్యాలను నిర్దేశించారు. ఇప్పటివరకు ఏడు లక్షలకు పైగా మొక్కలను నాటినట్లు జిల్లా అటవీ అధికారులు చెబుతున్నారు.

## గెలుపోటములు సహజమే

- క్రీడలతో మానసికోల్లాసం
- మాజీమంత్రి,ఎమ్మెల్యే హరీశ్‌రావు



జ్యోతిని వెలిగించి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: క్రీడాకారులు గెలుపు ఓటములను సహజమేనని వాటిని సమానంగా స్వీకరించాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. స్థానిక సిటిజన్ క్లబ్‌లో రాష్ట్రస్థాయి మహిళా వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రస్తుతం సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లల ఉన్నత చదువులు, విదేశాల పయనంపైనే ఆలోచిస్తూ పిల్లల ఆరోగ్యం గురించి మర్చిపోతున్నారన్నారు. చదువుతో పాటు ఆటపాటలు కూడా ఎంతో ముఖ్యమని క్రీడామైదానాల వైపు పిల్లలను దృష్టి సారించేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. వాలీబాల్‌ను గ్రామీణ క్రీడగా అభివర్ణించారు. సిద్దిపేటలో జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహణకు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జాతీయ వాలీబాల్ అకాడమి వైస్ ప్రెసిడెంట్ హన్మంతరెడ్డి, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిరాం, సిటిజన్ క్లబ్ అధ్యక్షుడు రమేశ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, వైస్‌చైర్మన్ కనకరాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

**గురుపూజలో ఉన్న సంతృప్తి ఎక్కడా లభించదు**

సిద్దిపేటఅర్బన్: పాఠాలు ఎవరైనా చెబుతారని, జీవిత పాఠాలు కొందరే చెబుతారని ఆ కొందరిలో దుర్గాప్రసాద్ స్వామీజీ ఒకరని, అలాంటి వ్యక్తిని గురువుగా భావించి సన్మానించుకోవడం తన అదృష్టంగా హరీశ్‌రావు పేర్కొన్నారు. గురుపూజోత్సవం పురస్కరించుకుని హనుమాన్ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ దుర్గాప్రసాద్ స్వామీజీకి సిద్దిపేటలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు పాల్గొని మాట్లాడారు. మనిషికి దైవ నామస్మరణ, గురుపూజలో ఉన్న సంతృప్తి, ఆనందం ఎందులోనూ ఉండదన్నారు. సిద్దిపేటలో ఏ కార్యక్రమం చేపట్టినా సిద్ధిస్తుందని, కోటి హనుమాన్ చాలీసా పారాయణం సంకల్పం సైతం సిద్ధించాలని కోరుకున్నారు.

## ఏడాది పాటు వందేళ్ల ఉత్సవాలు

- చట్ట సభల్లో సీపీఐ ఉంటేనే అర్థవంతమైన చర్చ
- ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్: సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ పార్టీ చేసిన త్యాగాలు, పోరాటాలు, ప్రజాఉద్యమంలో సాధించిన విజయాలపై ఏడాదిపాటు సీపీఐ వందేళ్ల ఉత్సవాలను నిర్వహించనున్నట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని సీపీఐ భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ...కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అరచేతిలో వైకుంఠం చూపెడుతూ జిమ్మిక్కుల పాలన కొనసాగిస్తుందన్నారు. దేశంలో కార్పొరేట్ శక్తులు సహజ వనరులను కొల్లగొడుతూ లక్షల కోట్లకు పడగలెత్తుతున్నారని ఆరోపించారు. ఆర్థిక నేరస్తులైన విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, లలిత మోదీ వంటి దొంగలకు ప్రధాని మోదీ వత్తాసు పలుకుతున్నారని తెలిపారు. ఆపరేషన్ కగార్ పేరిట ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి మావోయిస్టులను చంపడం ఏ చట్టంలో ఉందని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల పెంపు కోసం ఆర్డినెన్స్ తెస్తామన్న ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ మధ్య పొత్తు విషయంలో ఇప్పటికే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారన్నారు. దీనిపై ఎన్నికల నోటిఫికేషన్ విడుదల తర్వాత స్పష్టత వస్తుందని తెలిపారు. చట్టసభల్లో సీపీఐ ఉంటేనే అర్థవంతమైన చర్చ జరుగుతుందని చెప్పారు.

**ఈ నెల 16న సీపీఐ జిల్లా మహాసభలు**

హుస్నాబాద్‌లో ఈ నెల 16న సీపీఐ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు ఆపార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ తెలిపారు. ఈ మహాసభలకు జిల్లా నుంచి 300 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు జాగిరి సత్యనారాయణ, వనేష్, లక్ష్మణ్, నాయకులు కుమార్, జనార్దన్, భాస్కర్, సుదర్శనచారి, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

## 'ఆపన్నహస్తం' సేవలు

**లోక్‌సత్తా ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహన్‌రావు**



'ఆపన్నహస్త మిత్రబృందం'తో బండారు రామ్మోహన్‌రావు తదితరులు

గజ్వేల్: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న 'ఆపన్నహస్త మిత్రబృందం'సేవలు అభినందనీయమని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. గజ్వేల్‌లో శనివారం నిర్వహించిన ఆపన్నహస్త మిత్రబృందం కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...2017లో ఏర్పడిన ఆపన్నహస్త మిత్రబృందం ఇప్పటివరకు 106 సేవా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా మరెన్నో సంఘాలకు ఆదర్శంగా నిలిచిందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సరస్వతి శిశుమందిర్ ప్రధానాచార్యులు హరిణాపవన్, జాతీయ యువజన అవార్డుగ్రహీత దేశబోయిన నర్సింహులు, ఆపన్నహస్త మిత్రబృందం అధ్యక్షుడు బాల్‌చంద్రం, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి శ్యామ్‌ప్రసాద్, సహాయ కార్యదర్శి స్వామితో పాటు సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### యువతి అదృశ్యం

వర్గల్(గజ్వేల్): యువతి అదృశ్యమైన ఘటన వర్గల్ మండలం నాచారంలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్, సిద్ధార్థనగర్‌కు చెందిన ఆసియా ఖాతూన్(23) తన తల్లిదండ్రులతో కలిసి నాచారం సీడ్స్ కంపెనీలో పని చేస్తూ అక్కడే రూంలో ఉంటున్నారు. ఈ నెల 9న మధ్యాహ్నం ఆమె సామాను తీసుకొస్తానని తల్లిదండ్రులకు చెప్పి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### బైక్‌ను ఢీకొట్టిన కంటైనర్

ప్రమాదంలో వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన మాసాయిపేట శివారులోని 44వ నంబర్ జాతీయరహదారిపై శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం ... తూప్రాన్ పట్టణానికి చెందిన అంతారం రాఘవేందర్(38) పరిశ్రమల్లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పనుల కోసం చేగుంట వైపునకు బైకుపై వస్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న కంటైనర్ బైకును ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో రాఘవేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### అనారోగ్యంతో గల్ఫ్‌లో బెజ్జంకి వాసి మృతి

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రానికి చెందిన ఉమ్మడి రామచంద్రన్‌చారి (45) గల్ఫ్‌లో అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 15 ఏళ్లుగా దుబాయిలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 10న తాను పని చేస్తున్న ప్రదేశంలో కిందపడటంతో తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య వసంత, ఇద్దరు కూతుర్లున్నారు. వారి కుటుంబాన్ని గల్ఫ్ సంక్షేమ సంఘం ప్రతినిధులు, నాయకులు తిరుపతి, శ్రీనివాస్ పరామర్శించి సానుభూతి తెలిపారు.

### వరకట్నం కోసం వేధింపులు

అత్తింటి వారిపై కేసు నమోదు

అక్కన్నపేట(హుస్నాబాద్): అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదైంది. ఎస్‌ఐ చాతరాజు ప్రశాంత్ వివరాల ప్రకారం... మండలంలోని గౌరవెల్లి గ్రామానికి చెందిన స్వాతికి, సంగారెడ్డి జిల్లాకు చెందిన భానుప్రకాష్‌తో 2022లో వివాహం జరిగింది. పెండ్లి తర్వాత వీరిద్దరూ కొద్దిరోజులు కలిసిమెలిసి ఉన్నారు. భర్తతోపాటు అత్త, మామ అదనపు కట్నం తీసుకురావాలని స్వాతిని తరుచూ వేధిస్తున్నారు. ఈ క్రమంలో వీరిద్దరికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినా వేధింపులు ఆగకపోవడంతో స్వాతి ఫిర్యాదు మేరకు పోలీసులు భర్త, అత్త, మామపై కేసు నమోదు చేశారు.

### గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

వర్గల్(గజ్వేల్): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. గౌరారం సర్కిల్ కార్యాలయంలో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. బీహార్ నుంచి వచ్చి సిద్దిపేట జిల్లా మైలారంలో కూలీ పనులు చేస్తూ పవన్‌కుమార్(32) జీవిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు గౌరారం శివారులో సింగాయపల్లి చౌరస్తా వద్ద గంజాయి అమ్ముతున్న పవన్ కుమార్‌ను ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి అదుపులోకి తీసుకున్నారు. అతడి జేబులో 100 గ్రాముల గంజాయి దొరికింది. విచారించగా కొంత కాలం నుంచి బీహార్‌కు చెందిన నితిన్‌కుమార్ వద్ద కొనుగోలు చేసి గజ్వేల్‌లోని గ్రామాల్లో అమ్ముతున్నట్లు చెప్పాడు. గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.



# హరిత హీరోలు

## విరివిగా మొక్కలు పెంచుతున్న వృక్ష ప్రేమికులు

పెంపకంపై ఇతరులకు అవగాహన ● శుభకార్యాలకు మొక్కలే బహుమతి

పచ్చదనం పంచుతున్న ఇళ్లు, కార్యాలయాలు, పాఠశాలలు

సండే స్పెషల్

అడవులు అంతరించిపోతున్న తరుణంలో పలువురు వృక్ష ప్రేమికులు సొంతంగా మొక్కలు నాటుతూ పర్యావరణాన్ని పరిరక్షిస్తున్నారు. భవిషత్ తరాలకు మంచి వాతావరణం అందించడానికి తమ ఇంటి పరిసరాలు, పని చేసే చోట, ఖాళీ స్థలాల్లో విరివిగా మొక్కలు నాటుతున్నారు. విత్తన బంతులను తయారు చేసి చల్లుతున్నారు. వృక్షాల ప్రాముఖ్యత గూర్చి సమాజంలో పలువురికి అవగాహన కల్పిస్తూ పలువురు మొక్కలు నాటేలా కృషి చేస్తున్న హరిత ప్రేమికులపై సాక్షి సండే స్పెషల్.



చేర్యాల: ఇంటి ఆవరణలో పెంచిన మొక్కలతో ఉపాధ్యాయుడు వెంకటేశ్

### ఉపాధ్యాయుడి ఇల్లు.. ఉద్యాన వనం

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన అంబాల వెంకటేశ్‌గౌడ్, ప్రస్తుతం చుంచనకోట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. మొక్కలంటే మక్కువ. తన ఇంటినే ఉద్యానవనంగా మార్చుకున్నాడు. ఇంటిలో నాటిన మొక్కలకు నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో కొంత సమయం కేటాయించి వాటిని సంరక్షిస్తున్నాడు. ఖాళీ స్థలంలో మొక్కలు నాటి పెంచుతుండటంతో ఇంటి పరిసరాలు ఉద్యానవనాన్ని తలపిస్తున్నాయి. ఎర్రచందనం, శ్రీగంధం, మూడు రకాల మామిడి, రెండురకాల ఉసిరి మొక్కలతో కలుపుకొని మొత్తం 15 రకాల పండ్ల జాతి, 8 రకాల పూల మొక్కలు, కొన్ని రకాల తీగజాతి కూరగాయ తోటలు పెంచుతున్నాడు. పండ్లు, పూలు, నీడనిచ్చే, వాటిని కలుపుకుని మొత్తం 200 రకాలు మొక్కలు ఆ వనంలో ఉన్నాయి. గతంలో కేరళకు వెళ్లిన ఆయన అక్కడ ఏ ఇంటి ఆవరణ చూసినా వనంలా కనిపించడంతో అలా తన ఇంటిని కూడా ఉద్యానవనంగా మార్చుకున్నాడు.



కొల్చారం వరిగుంతం పాఠశాలలో పచ్చని చెట్ల మధ్య విద్యార్థులు, ఉపాధ్యాయులు

### మొక్కవోని దీక్ష

కొల్చారం(నర్సాపూర్): పచ్చని చెట్లతో నిండి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కనిపిస్తున్న ఈ ప్రదేశం మండలంలోని వరిగుంతం ఉన్నత పాఠశాల ఆవరణ. ఆరేళ్ల క్రితం హరితహారంలో భాగంగా ఆవరణలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో ఉత్తమ పాఠశాలగా ఎంపికైంది. మొక్కవోని దీక్షతో ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. పాఠశాల ఆవరణ పచ్చదనంతో నింపాలన్న ఆశయంతో ముందుకు సాగుతామని ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిన పూనుతున్నారు.

### మా ఇంటి తోట

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కృష్ణవేణి ఇంట్లోనే పలు రకాల మొక్కలు పెంచుతున్నారు. మొక్కల పెంపకంపై ఆసక్తితో ఆమె ఐదేళ్లుగా ఇంటి ఆవరణలో మామిడి, జామ, కరివేపాకు, మల్లె చెట్టు, శ్రీగంధం, ఎర్రచందనం, లక్ష్మణఫలం, బిర్యానీ ఆకు, తైవాన్ మామిడి, తైవాన్ జామ, అశ్వగంధం, అల్లనేరేడు, అవకాడో, అంజీర్ మొక్కలను నాటారు. వీటితోపాటు అంతర పంటగా పసుపు, వేరుశనగ పండిస్తున్నారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా మొక్కలను సేంద్రీయ ఎరువులతో మాఇంటి తోటలో పెంచుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



తోటలో పెంచుతున్న తైవాన్ మామిడి చెట్టుతో కృష్ణవేణి

### కోటి మొక్కలు నాటడమే సంకల్పం



మొక్కలు నాటుతున్న జ్ఞానేశ్వర్

తయారు చేసిన విత్తన బంతులు

నారాయణఖేడ్: మనుషులు చెట్లను ఇష్టానుసారంగా నరికి వేస్తుండటంతో ప్రకృతి గతి తప్పిందని భావించాడు. కోటి మొక్కలు నాటాలని పదేళ్ల క్రితం దీక్ష బూనాడు. ఆయనే సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం ముక్టాపూర్ గ్రామానికి చెందిన పాలడుగు జ్ఞానేశ్వర్. కోటి మొక్కలు నాటే వరకు పాదరక్షలు ధరించబోనని శపథం చేశాడు. ఇప్పటి వరకు 3.50లక్షల మొక్కలను అడవులు, నదీ పరివాహక ప్రాంతాల్లో, దేవాలయ ప్రాంగణాలు, పాఠశాల ఆవరణలో నాటారు. విత్తన బంతులు తయారు చేసి నర్సాపూర్, మెదక్, మంజీరా నదికి ఇరువైపులా తాను చల్లడమే కాకుండా విద్యార్థులతో చల్లించారు. జ్ఞానేశ్వర్‌కు కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ మొక్కలను అందిస్తుంది. ఈ పర్యావరణ ప్రేమికుడికి 'సాక్షి' దినపత్రిక ఎక్స్‌లెన్స్ అవార్డును గవర్నర్ విశ్వభూషన్ హరిచందర్ చేతులమీదుగా, భారత్ యువ పురస్కార్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ ద్వారా ఎర్త్ లీడర్ అవార్డులతోపాటు సత్కారాలు పొందాడు.

### ఆ పాఠశాల నందనవనం

తూప్రాన్: ఆహ్లాదం..పచ్చదనంతో పట్టణ పరిధిలోని పోతరాజుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నందనవనంను తలపిస్తోంది. విద్యార్థులు మొక్కలు నాటడంతో ఏపుగా పెరిగి నేడు వృక్షాలుగా దర్శనమిస్తున్నాయి. పచ్చదనం అలుముకుని చల్లని నీడతోపాటు స్వచ్ఛమైన గాలిని అందిస్తున్నాయి. గత ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రతి విద్యార్థి ఒక మొక్క చొప్పున పూలు, పండ్ల మొక్కలు దానిమ్మ, జామ, కర్జూరం, బాదం, మామిడి తదితర మొక్కలు పాఠశాల ఆవరణలో నాటారు. వాటి సంరక్షణ బాధ్యతలను ఆ విద్యార్థులకు అప్పగించారు. దీంతో విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో మొక్కలకు నీరు పోసి సంరక్షించారు. నేడు ఆ మొక్కలే వృక్షాలై చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషిని గ్రామస్తులు అభినందిస్తున్నారు.



పోతరాజుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..



ఆస్పత్రి ఆవరణలో పచ్చదనం వెల్లివిరిసేలా గ్రీనరీ

### ఆ ఆస్పత్రి హరిత వనం

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణం చుట్టూ పచ్చదనం పరిచినట్లుగా చెట్లు, మొక్కలు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ రెడ్డి వందలాది మొక్కలు నాటించారు. దాదాపు మూడేళ్ల నుంచి గ్రీనరీపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. నాటిన మొక్కలను సంరక్షిస్తూ చెట్ల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆ మొక్కలు నేడు ఎపుగా పెరిగి ఆస్పత్రి వచ్చే రోగులకు నీడనిస్తున్నాయి. వారితో పాటు రోగులను చూడటానికి వచ్చే బంధువులు సైతం చెట్ల నీడన సేద తీరుతూ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. పూల మొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కలు పెంచుతూ ఆస్పత్రి ఆవరణను హరిత వనంగా మార్చారు. ఆస్పత్రి ప్రధాన ద్వారాల వద్ద ఏర్పాటు చేసిన పూల కుండీలు అందరిని ఆకర్షిస్తున్నాయి.

### భవిషత్ తరాల కోసం నాటుదాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మొక్కలు నాటడం అంటే ఎంతో ఇష్టం. ఆయనే తెల్లాపూర్ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట భాస్కర్. నిత్యం పాఠశాలలో పర్యావరణంపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఒక్క విద్యార్థి మొక్కలు నాటే విధంగా తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటి వరకు పాఠశాల ఆవరణలో 350 మొక్కలు నాటారు. గతంలో ఆయన ఎద్దుమైలారం పాఠశాలలో పని చేసిన సమయంలో 400 మొక్కలు నాటి కలెక్టర్ నుంచి గ్రీన్ స్కూల్ అవార్డును సైతం తీసుకున్నారు. భవిష్యత్ తరాల వారికి మంచి వాతావరణం ఇవ్వాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిస్తున్నారు.



తెల్లాపూర్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, విద్యార్థులు



గౌసొద్దీన్ ఇంటి ఆవరణలో పెంచుతున్న మొక్కలు

### మొక్కలంటే ప్రాణం



గౌసొద్దీన్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ డబుల్ బెడ్రూం కాలనీలో గల గౌసొద్దీన్ ఇళ్లు పచ్చదనంతో వెల్లివిరిస్తోంది. ఆయనకు మొక్కలు పెంచడం అలవాటు. ఇంటి లోపల, బయట ఎక్కడ చూసిన వివిధ రకాల మొక్కలు, చెట్లు దర్శనమిస్తున్నాయి. వరండాలో పైకప్పు, మెట్లకు ఇరు పక్కల, ఇంటి గేటు పక్కన ఖాళీ స్థలం లేకుండా మొక్కలను పెంచడంతో ఇంటి ప్రాంగణం అంతా ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. వివిధ రకాల పూలు, పండ్లు తదితర మొక్కలు దర్శనమిస్తున్నాయి. ఇక్కడి కాసిన పండ్లు ఇతరులకు ఉచితంగా అందజేస్తారు. మొక్కల పెంపకం కోసం ఆయన వేల రుపాయలు ఖర్చు చేస్తుంటారు. తనకు మొక్కలంటే ప్రాణమని, వాటి పెంపకం కోసం ప్రతి రోజు కొన్ని గంటల సమయం కేటాయిస్తానని గౌసొద్దీన్ తెలిపారు.

### పచ్చని తోరణంలా ద్రాక్ష తీగ

దుబ్బాకటౌన్: ఇంటిని పచ్చని తోరణంలా ఉంచడానికి, ఎండాకాలంలో భవనాన్ని చల్లగా ఉంచడానికి , వాతావరణ కాలుష్యం నుంచి ఉపశమనం పొందడానికి పచ్చని పొదరిల్లుగా తీర్చిదిద్దింది ఓ గృహిణి. దుబ్బాక పట్టణానికి చెందిన కోమలి వినూత్న ఆలోచనతో ఇంట్లో ఉన్న తక్కువ ఖాళీ స్థలంలో ప్రత్యేక ద్రాక్ష మొక్కలను నాటింది. దీంతో వేసవి కాలంలో ఇంట్లోకి ఎండ పడకుండా చల్లగా ఉండేలా ఇంటిముందు ద్రాక్ష తీగలు పందిరిలా అల్లుకుపోయేలా ఏర్పాట్లు చేసింది. ఈ మొక్కలు తీగలా అల్లుకుని చల్లదనంతో పాటు పండ్లను సైతం ఇస్తున్నాయి. ఇంటిపై సైతం మరిన్ని మొక్కలు నాటడానికి ప్రయత్నాలు చేస్తున్నా. ఇంటి ముందే కాకుండా భవనంపై సైతం మొక్కలు నాటడానికి నూతన తరహాలో ఆలోచన చేసింది. భవనంపై ఇటీవల డ్రాగన్, కివీ మొక్కలు నాటింది

ఇంటి ముందు పందిరిలా అల్లుకున్న ద్రాక్ష చెట్టుతో కోమలి



### హరితం ఆయన అభిమతం



మొక్కలకు నీరు పడుతున్న నాగరాజు

సిద్దిపేటజోన్: పట్టణానికి చెందిన రాదారి నాగరాజు ప్రభుత్వ ఉపాధ్యాయుడు. విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పడంతో పాటు మొక్కల పెంపకం, వృక్షాల ప్రాముఖ్యత గూర్చి కొన్నేళ్లుగా అవగాహన కల్పిస్తున్నారు. ఇరుకోడ్ మోడల్ స్కూల్‌లో సుమారు 3వేల మొక్కలు నాటి హరితహారంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాల అవార్డు సాధించేలా కృషి చేశారు. తన ఇంటిని సైతం 300 మొక్కలతో నింపేశారు. మిద్దె తోటల పెంపకాన్ని సిద్దిపేటలో విస్తరించారు. పాఠశాలలో వృక్షా బంధన్ పేరిట చెట్లకు పిల్లలతో రాఖీ కట్టించి మొక్కల గూర్చి ప్రచారం చేశారు. సెమినార్, శిక్షణ తరగతులలో మొక్కల పెంపకం గూర్చి వివరించారు. శుభకార్యాలకు మొక్కను బహుమతిగా ఇవ్వడం ఆయన ఆనవాయితీగా మార్చుకున్నారు.

## బైక్ దొంగలు అరెస్ట్

13 బైకులు స్వాధీనం

జహీరాబాద్ టౌన్: పార్కింగ్ చేసిన బైకులను తస్కరించిన కేసులో ముగ్గురిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10 లక్షల విలువ చేసే 13 బైకులను స్వాధీనం చేసుకున్నారు. జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్, టౌన్ సీఐ.శివలింగంతో కలిసి స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కర్నాటక రాష్ట్రంలోని బీదర్ పట్టణానికి చెందిన ఎండీ.ఫారూక్(19), అంజద్‌పాషా(26), లాహెఖ్(22) పార్కింగ్ చేసిన బైకులను చోరీ చేస్తున్నారు. నాలుగేళ్ల నుంచి జహీరాబాద్, సంగారెడ్డి, సదాశివపేట, హైదరాబాద్‌లో పలు బైకులను అపహరించారు. ఈ క్రమంలో పోలీసులు జాతీయ రహదారి 65పై బీదర్ చౌరస్తా వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించగా బైక్‌పై వెళ్తున్న యువకులను అనుమానంతో ఆపారు. అదుపులోకి తీసుకొని విచారించగా బైకులను చోరీ చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి బైకులను స్వాధీనం చేసుకున్నారు. వీరు పలు దొంగతనం కేసుల్లో జైలుకు కూడా వెళ్లివచ్చారని పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన టౌన్ సీఐ.శివలింగం, ఎస్‌ఐ.వినయ్‌కుమార్, ఐడీ పార్టీ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



నిందితులు చోరీ చేసిన బైకులు, చిత్రంలో పోలీసులు

## పురుగుల మందు తాగి ఆత్మహత్య

రామాయంపేట(మెదక్): ఆర్థిక సమస్యలతో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... పట్టణానికి చెందిన కుమ్మరి భూమయ్య (48) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి తన ఇంట్లో క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**మద్యానికి బానిసై..**

పటాన్‌చెరు టౌన్: మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మెదక్ జిల్లా శంకరంపేటకు చెందిన శ్రీను(36) కుటుంబ సభ్యులతో కలిసి రెండు నెలల క్రితం వచ్చి పటాన్‌చెరు మండలం ఇంద్రేశంలోని అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శ్రీను శుక్రవారం కుమారుడు బాలరాజ్ (4)కు జ్వరం రావడంతో భార్య స్వరూపను పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లమని చెప్పగా ఆమె వెళ్లింది. తిరిగి ఇంటికి వచ్చేసరికి భర్త ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. స్థానికుల సహాయంతో కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. తన భర్త రోజు మద్యం తాగుతాడని, గతంలో మద్యం తాగి మూడు సార్లు ఉరివేసుకునేందుకు ప్రయత్నించాడని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి కాపర్ వైర్ చోరీ
● అంతర్రాష్ట్ర నిందితుల్లో ఇద్దరి అరెస్టు.. పరారీలో ముగ్గురు
● 227కేజీల కాపర్ వైర్, 3లక్షల నగదు స్వాధీనం
● కేసు వివరాలు వెల్లడించిన సీపీ అనురాధ

## జల్సాలకు అలవాటు పడి..

సిద్దిపేటకమాన్: ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి అందులోని కాపర్ వైరును దొంగిలిస్తున్న ముఠాలోని ఐదుగురు నిందితుల్లో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసు కమిషనర్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ అనురాధ కేసు వివరాలు వెల్లడించారు. కొండపాక మండల కేంద్రంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు మే 27న చోరీ చేసినట్లు విద్యుత్‌శాఖ ఏఈ కుకునూరుపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే జిల్లాలో మరి కొన్ని గ్రామాల్లో కూడా ఇదే తరహా ఘటనలు చోటు చేసుకోవడంతో రైతులు విద్యుత్ సమస్యతో పొలాల దగ్గర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో గజ్వేల్ ఏసీపీ నరసింహులు ఆధ్వర్యంలో తొగుట సీఐ లతీఫ్, కుకునూర్‌పల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి కేసు దర్యాప్తు చేపట్టారు. రాజస్థాన్ రాష్ట్రం భరత్‌పూర్ జిల్లాలోని ఝూనతి గ్రామానికి చెందిన మహమ్మద్ అజారుద్దీన్ (27), మహమ్మద్ షాకీర్ (28), తెలీమ్‌ఖాన్, సలీమ్ అలియాస్ సోహెల్, అక్రమ్ సిద్దిపేట జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో జేసీబీ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వీరు జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో ఐదుగురు ముఠాగా ఏర్పడ్డారు. పగలు రెక్కీ నిర్వహించి రాత్రి సమయంలో ఇద్దరు నిందితులు ద్విచక్ర వాహనంపై వచ్చి ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులోని కాపర్ వైర్‌ను దొంగిలిస్తున్నారు. వీరికి మరో ముగ్గురు నిందితులు సహకరించే వారు. దొంగిలించిన కాపర్ వైర్‌ను హర్యానా, ఇతర ప్రాంతాల్లో స్క్రాప్ షాప్‌లలో విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు.



రికవరీ చేసిన కాపర్ వైర్‌ను చూపుతున్న పోలీసు అధికారులు

**185 కేసుల్లో నిందితులు..**

కొన్ని నెలలుగా సిద్దిపేట జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో మొత్తం 185 ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి కాపర్ వైర్ చోరీ చేసినట్లు పలు పోలీసు స్టేషన్‌లలో నిందితులపై 185 కేసులు నమోదయ్యాయి. నాలుగు నెలలుగా సిద్దిపేట జిల్లాలో 26, మెదక్‌లో 34, కరీంనగర్ జిల్లాలో 19, వరంగల్ జిల్లాలో 63, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 40, సైబరాబాద్ పరిధిలో 2, పెద్దపల్లి జిల్లాలో ఒక ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి కాపర్ వైరును తస్కరించారు. అజారుద్దీన్ 49 కేసుల్లో నిందితుడిగా ఉండటంతో పాటు షామీర్‌పేట పీఎస్ పరిధిలో జరిగిన ఓ కేసులో రెండేళ్ల జైలు శిక్ష అనుభవించాడు. టెక్నాలజీ సాయంతో నిందితులను గుర్తించి వారిలో మహమ్మద్ అజారుద్దీన్, మహమ్మద్ షాకీర్‌లను రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 272 కేజీల కాపర్ వైర్, రూ.3,24,700 నగదుతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని సీపీ తెలిపారు. పరారీలో ఉన్న ముగ్గురిని త్వరలో పట్టుకుంటామన్నారు. టెక్నాలజీ సాయంతో నిందితులను అరెస్టు చేయడంలో కీలకపాత్ర వహించిన సీఐ లతీఫ్, ఎస్‌ఐ శ్రీనివాస్, బేగంపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు మధుసూదన్‌రెడ్డి, రమణ, ఐటీ కోర్ సిబ్బంది శ్రీకాంత్, రమేష్, కానిస్టేబుల్స్‌ను అభినందించి, నగదు రివార్డు అందజేశారు.